క్లుప్తంగా

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి



తిరువూరు: 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ బీఎల్ఓలను ఆదేశించారు. నగరపంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,300 మంది ఓటర్లు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సర్వే వేగవంతం చేయాలి

గంపలగూడెం: గంపలగూడెంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వే వేగవంతం చేసి, రికార్డులను గెజిట్ నోటిఫికేషన్‌కు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్వామిత్వ సర్వే సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ పట్టణ పరిధిలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయి గ్రౌండ్ వాల్యుయేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తదుపరి 13 నోటిఫికేషన్ (గెజిట్ నోటిఫికేషన్)కు వెళ్లాల్సి ఉందని తెలిపారు. సర్వేలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను సక్రమంగా నిర్ధారించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలు ఉంటే ఈ సర్వేలో స్వాధీనపరచుకోవాల్సి ఉందన్నారు. ప్రజల ఇల్లు, ఖాళీ స్థలాలకు సంబంధించిన వివరాలను సర్వేయర్లు పూర్తిగా సేకరించాలన్నారు. సర్వేయర్లు విజయలక్ష్మి, గోపి, పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్లో ఈనెల 29న క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థిని పామర్తి యామిని ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం డీ మల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. దీని వల్ల మానసిక, శారీరక దారుఢ్యం పెరుగుతుందని, తద్వారా అన్ని రంగాల్లో ముందుకు సాగుతారన్నారు. రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు నిఖిల్, ఉగ్ర, మేఘన, రాజేష్, గుణశ్రీ, జాహ్నవి, దేవీశ్రీ, జయశ్రీ, అనూషను అభినందించారు.

అమరవీరులకు నివాళి



తిరువూరు: విద్యుత్ చార్జీలు తగ్గించాలని శాంతియుత ఆందోళన చేస్తున్నవారిపై తెలుగుదేశం ప్రభుత్వం 2000 సంవత్సరంలో జరిపిన దౌర్జన్యకాండలో అసువులు బాసిన అమరవీరులకు సోమవారం తిరువూరు సుందరయ్య భవన్లో నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై పోరాడేవారిపై టీడీపీ ప్రభుత్వం అణచివేత ధోరణి అనుసరించి ముగ్గుర్ని బలితీసుకుందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు శ్రీనివాసరావు, నాగరాజు, కల్యాణ్, ఆలీబాబా, రవి పాల్గొన్నారు.

దేవినేని ఉమా ధర్నా, అరెస్టు

మైలవరం: ఇసుక అధిక ధరకు అమ్ముతున్నారంటూ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మైలవరంలోని ఇసుక డంపింగ్ యార్డు వద్ద సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. స్థానిక తిరువూరు రోడ్డులోని ఇసుక డంపింగ్ యార్డు వద్ద జాతీయ రహదారికి అడ్డంగా కూర్చుని ధర్నా చేపట్టడంతో పోలీసులు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఉమాను వదిలివేశారు. కాగా మైలవరంలో తన ఉనికికి చాటుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత డాటా ఎంట్రీ కోర్సు

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు అసోసియేట్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సును ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి సోమవారం తెలిపారు. ఎస్ఎస్‌సీ, 10ప్లస్ 2, డిగ్రీ ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, సెప్టెంబర్ 4వ తేదీ లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డేటా ఎంట్రీ కోర్సులో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి. నరేష్ కుమార్ తెలిపారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు నంబర్, ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 4న ఉదయం 10 గంటలకు సంప్రదించాలని సూచించారు.

సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతం

ఎమ్మెల్యే రక్షణనిధి

తెల్లదేవరపల్లి (విస్సన్నపేట): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లి తండాలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించడంలో భాగంగా సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున మండలంలోని 15 సచివాలయాలకు రూ.3 కోట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో అవసరమైన చోట సీసీరోడ్లు, విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెల్లదేవరపల్లి గ్రామంలో 250 మందికి సంబంధించి రెడ్ మార్క్ సమస్య ఉన్నటువంటి ఎస్టీ, ఎస్సీ, సన్నకారు రైతుల భూములు ఉన్నాయని, ఆ భూములకు రెడ్ మార్క్ సమస్య పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పుట్రేలలో ఉషోదయ భూములు, రెడ్ మార్క్ ఉన్న భూముల సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మేర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనుమోలు శివబాజీ తదితరులు పాల్గొన్నారు.



తెల్లదేవరపల్లి తండాలో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు

ఉడతాకు సాహితీ చక్రవర్తి అవార్డు

మైలవరం: స్థానిక శ్రీలీలావతి గిరిజన పాఠశాల హెచ్‌ఎం ఉడతా లక్ష్మీనారాయణ సాహితీ చక్రవర్తి అవార్డును అందుకున్నారు. విజయవాడ సత్యనారాయణపురంలోని ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్ ఆడిటోరియమ్‌లో జరిగిన 22వ మానస సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ వార్షికోత్సవంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం ద్వారా ఉడతాకు అవార్డు ప్రదానం చేసినట్లు సంస్థ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బ్రహ్మనందరావు మాట్లాడుతూ వివిధ కవితాంశాలలోను, కథా వస్తువులలోను, సాహిత్యాభిలాషను, ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉడతా దంపతులను నిర్వాహకులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఉడతా లక్ష్మీనారాయణ దంపతులను సత్కరిస్తున్న బ్రహ్మానందరావు, డాక్టర్ సమరం

'స్పందన'లో మూడు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



గంపలగూడెంలో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

ఘనంగా తెలుగు భాషావారోత్సవాలు



చెవుటూరులో కోలాటంతో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



పెనుగొలనులో కవుల చిత్రపటాల ప్రదర్శన

జి.కొండూరు: మండలంలోని చెవుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషావారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి సేవలను గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వం, వ్యాస రచన, నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు.

తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు

మైలవరం: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి అని, తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని శ్రీలీలావతి గిరిజన పాఠశాల హెచ్‌ఎం ఉడతా లక్ష్మీనారాయణ తెలిపారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో గిడుగు రామమూర్తి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తెలుగు సంస్కృతిని తెలియజేసేవిధంగా పంచెకట్టు, చీరల వస్త్రధారణతో అలరించారు. ఉడతా మాట్లాడుతూ తెలుగ భాషా మాట్లాడటం ద్వారా ఈ భాషలోని 56 అక్షరాలు మనిషి శరీరంలోని ప్రతి అవయవ పనితీరును మెరుగుపరుస్తాయన్నారు. తెలుగు పద్యం తెలుగువారి సొంతం అన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి రాధాకుమారి పాల్గొన్నారు.

గిడుగు బాటలో నడుద్దాం

గానుగపాడు(తిరువూరురూరల్): తెలుగుభాషను సరళంగా తీర్చిదిద్దడంలో కృషిచేసి వ్యవహారిక భాషగా వాడుకలోకి తెచ్చిన గిడుగు రామ్మూర్తి పంతులు నేటి తరానికి ఆదర్శప్రాయుడని తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు టీ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం తెలుగు భాషావారోత్సవాల్లో భాగంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉమామహేశ్వరరావును విద్యార్థులు సన్మానించారు.

111 మంది కవుల చిత్రపటాల ప్రదర్శన

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను జెడ్పీ హైస్కూల్లో సోమవారం షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు వాడుకభాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు 111 మంది కవులు, కవయిత్రిల చిత్ర పటాలు చేతపట్టుకుని నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల హెచ్‌ఎం కృష్ణాఫర్, విశ్రాంత ఎంఈఓ వి.శేషిరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో..

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్లో తెలుగుభాషా వారోత్సవాల సందర్భంగా సోమవారం విద్యార్థులకు తెలుగులో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆంగ్ల పదాలు లేకుండా స్వచ్ఛమైన తెలుగులో ఉపన్యసించడంపై ఈ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం హరికృష్ణ తెలిపారు. విజేతలకు మంగళవారం బహుమతి ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.



గానుగపాడులో గిడుగు జయంతి



లక్ష్మీపురం పాఠశాలలో తెలుగు వక్తృత్వ పోటీలు

మద్యం మత్తులో ఘర్షణ–ఒకరికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైన్‌షాపు వద్ద జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కొండపల్లి–ఈలప్రోలు రోడ్డులో వైన్‌షాపు వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. సేకరించిన వివరాల మేరకు ఈలప్రోలు గ్రామానికి చెందిన కొందరు యువకులు షాపులో మద్యం బాటిళ్లు తీసుకుని మద్యం తాగారు. మద్యం మత్తులో మాటామాటా పెరిగిన రెండు వర్గాలుగా విడిపోయి తోపులాటకు దిగారు. వారిని విడదీసేందుకు ప్రయత్నించిన సుధీర్ అనే యువకుడిని ప్రేమ్‌కుమార్ అనే యువకుడు మద్యం సీసాతో మెడపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. గాయపడిన యువకుడిని ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడు ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



గాయపడిన సుధీర్

పెనుగొండ హరినాథ్‌బాబు మృతి



నూజివీడు: నూజివీడు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వ్యవస్థాపకుడు, ప్రస్తుతం గౌరవాధ్యక్షుడిగా పనిచేస్తున్న పెనుగొండ హరినాథ్‌బాబు(77) సోమవారం మృతి చెందారు. ఆర్యవైశ్య పట్టణ ప్రముఖుల్లో ఒకరిగా ఉంటూ దాదాపు 40 ఏళ్ల పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పనిచేశారు. అనారోగ్యానికి గురైన హరినాథ్‌బాబు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు.

పేదలకు భూపట్టాలివ్వాలి

తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజన్లో అటవీ భూములు, ప్రభుత్వ భూములను సాగుచేస్తున్న పేద వ్యవసాయకూలీలకు పట్టాలివ్వాలని కోరుతూ తిరువూరు ఆర్డీఓకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఏట నారాయణకు సంఘ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, కల్యాణ్ వ్యవసాయ కార్మికుల సమస్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ సదుపాయాలు పొందడానికి, బ్యాంకు రుణాలు తీసుకునేందుకు అవసరమైన భూహక్కు పత్రాలను పంపిణీ చేయాలని కోరారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

రెడ్డిగూడెం: మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ రామినేని దేవిప్రవణ్య పేర్కొన్నారు. రెడ్డిగూడెం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో పాటు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సారథ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కారించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీలు చాట్ల రాబర్టు, పాటిబండ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వర ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ మల్లాది రాణి, మతాంగి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పాల్, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

నూజివీడు: ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్లో సోమవారం దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. డెన్మార్క్‌కు చెందిన కామిశెట్టి రేణుకుమార్, అమెరికాలో స్థిరపడిన కామిశెట్టి కరుణాకర్ కృత్రిమ కాళ్లను అందించగా వాటిని కర్నూలుకు చెందిన గద్దా గిరిబాబు, తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన గురజాల యశోద కృష్ణ, కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన కిమ్మిడి శైలజకు కృత్రిమ కాళ్లను అందజేశారు. తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో మాస్టర్ ప్రణవ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంస్థ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మీ, ప్రిన్సిపాల్ బి సాయిబాబు, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.



దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేస్తున్న హీల్ ప్యారడైజ్ సంస్థ

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మహిళకు జగనన్న సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: స్థానిక సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మూడవ నంబర్ గ్రామ సచివాలయం పరిధిలోని అయ్యప్పనగర్, సూరిబాబుపేట, బాలయోగినగర్, చంద్రబాబునగర్, ఆదామ్‌పురం తదితర ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఆయా కాలనీల వద్ద ఎమ్మెల్యేకు హారతులు పట్టి స్వాగతం పలికారు. స్థానిక అయ్యప్పనగర్‌లో ఓ మహిళ తమ ఇంటి వరకు పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరింది. స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ కార్యదర్శి రఫీకి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ ఆ ఇంటిలోని కుటుంబ సభ్యులకు జగన్ సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి స్థానిక నారాయణనగర్, డౌన్ సెంటర్‌లో పర్యటించారు. డౌన్ సెంటర్‌లో నివాసముంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మమ్ము గుండె ఆపరేషన్ చేయించుకోగా ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఎమ్మెల్యే ప్రతాప్‌కు సత్కారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీలో సభ్యుడిగా నియమితులైన పట్టణానికి చెందిన బసవా వినయ్, పలువురు నాయకులు కలిసి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు తవిడిశెట్టి అశోక్, మేశపాం ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల రవికిరణ్, 14వ వార్డు కౌన్సిలర్ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణ, సతీష్, జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు తాడేపల్లి ఆంధ్రూస్‌పాల్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేపటి నుంచి దర్గా ఉరుసు మహోత్సవాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బీకాలనీ వద్ద హజరత్ షేక్ దావూద్ ఆవులియా దర్గా 129వ ఉరుసు మహోత్సవం బుధ, గురువారం రెండు రోజులు జరుగుతాయని దర్గా ముజావర్లు సోమవారం తెలిపారు. 129 ఏళ్లుగా జరుగుతున్న ఉరుసు మహోత్సవాల్లో భాగంగా 30న సాయంత్రం ముజావర్లు ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా బయలుదేరి దర్గా చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 31న దీపారాధనతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కుల మతాలకు అతీతంగా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనాలని ముజావర్లు కోరారు.



ఉరుసు మహోత్సవాలకు ముస్తాబైన హజరత్ షేక్ దావూద్ ఆవులియా బాబా సమాధి

ఆరోపణలు చేస్తే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ నాయకులు



ఆగిరిపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నూజివీడు: పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని, అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల నాయకులు హెచ్చరించారు. ముసునూరులో నిర్వహించిన రచ్చబండలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్, ఆయన తనయుడు చంటినాయనపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఆగిరిపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు మాట్లాడుతూ ఇసుక దోపిడీ, భూదందా, అక్రమ క్వారీలు నిర్వహిస్తున్నారంటూ ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. దోపిడీ చేయడానికి నూజివీడులో ఇసుక ఎక్కడ ఉందో చెప్పాలన్నారు. ఇసుక ఉందో లేదో కూడా తెలియకుండా మాట్లాడటం లోకేష్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. దమ్ముంటే ఒక్క ఎకరమైనా ఆక్రమించినట్టు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. క్వారీలకు ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తోటపల్లిలో ఉన్న క్వారీకి 2018లో టీడీపీకి చెందిన లావు ప్రసాద్ పేరున అనుమతులు ఇచ్చారని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ నారా లోకేష్ ఏమీ తెలియకుండా ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్ట్ చదివి ఆధారాల్లేని ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఇప్పటికీ క్వారీలు నడుపుతున్న వ్యక్తిని యువగళం పాదయాత్రలో లోకేష్ పక్కన పెట్టుకుని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, సీతారాంపురం సర్పంచ్ అత్తిమురళి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇస్మాకు, నాగుల్ మీరా, వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, ఆగిరిపల్లి మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కాంచనరావు, లక్ష్మణరావు, శ్రీమనారాయణ, సక్కేశ్వరరావు, సుభాని, రాంబాబు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని విమర్శలు చేయాలి

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వెంకట నాగ వేణుగోపాల అప్పారావును విమర్శించే స్థాయి నారా లోకేష్‌కు లేదని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గెలవలేని లోకేష్ ఎమ్మెల్యే తనయుడిని విమర్శించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల మన్ననలను పొందేవారిని ఎన్నికలలో గెలిపిస్తారని, ప్రజాదరణ లేని లోకేశ్ లాంటి వ్యక్తిని ప్రజలు విశ్వసించరని ఆయన ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు ప్రజల్లో ఆదరణ ఉండబట్టే మూడుసార్లు ఎమ్మెల్యేగా ఆయనను గెలిపించారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని లోకేష్ మాట్లాడాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, మండల నాయకులు బాబ్జీ, ప్రసాదుబాబు, చెన్నారావు, నరసింహారావు, సత్యనారాయణ, వాసు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరావు, అప్పిరెడ్డి, నబాబు, రాజు, శివాజీ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

తిరువూరు: బహుజన్ సమాజ్ పార్టీ ఎన్నికల ప్రచార రథాన్ని స్థానిక బోస్ సెంటర్లో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కెపోగు వందన్‌కుమార్ ప్రారంభించారు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా మాయావతి, కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. బీఎస్పీ స్థానిక నాయకులు గంగవరపు దేవా, బీజే సుందరరావు, సీహెచ్ వీరాస్వామి, పత్తిపాటి మల్లయ్య, మల్లాది అశోక్ తదితరులు పాల్గొన్నారు.